# తెలంగాణ నెత్తిన హిమాచల్ గుదిబండ!

## కాంగ్రెస్ 'కరెంట్' అఫైర్స్!

### 6,200 కోట్ల వ్యయం
### ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్టు

- రాష్ట్రంగాని రాష్ట్రంలో, అనువుగాని చోట 2 జలవిద్యుత్తు ప్లాంట్లు
- హిమాచల్‌ప్రదేశ్‌లో టూవీలర్ కూడా వెళ్లలేని చోట నిర్మాణం
- ఎన్టీపీసీ చేతులెత్తేసినా.. సెలి, మియార్ ప్లాంట్లకు సిద్ధం
- ఫీజిబిలిటీ రిపోర్ట్, డీపీఆర్ లేకున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ ఉబలాటం
- ప్రతికూలమైనా పరుగు.. అందులోనూ చీకటికోణం
- జెన్‌కో బోర్డు ఆమోదం లేకున్నా ఖాతానుంచి 26 కోట్లు డ్రా?

కొంటు మల్లేశం

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకోకుండానే రేవంత్ సర్కారు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్తు ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉబలాటపడుతున్నది. దీని వెనుక చీకటి దందా దాగి ఉన్నదని విద్యుత్తు రంగ నిపుణులే ఆరోపిస్తున్నారు. ఇది విద్యుత్తు రంగంలో భారీ కుంభకోణం కానున్నదని, కోట్లాది రూపాయలను కొల్లగొట్టడమే ధ్యేయంగా ఈ ప్లాంట్లను తెరపైకి తెచ్చారనే చర్చ జరుగుతున్నది. ఈ ప్రాజెక్టుల పేరిట ప్రజాధనాన్ని మళ్లించడం.. దానికి అభివృద్ధి అన్న ట్యాగ్ తగిలించడం.. అక్కడి నుంచి కావాల్సిన వారి ఖాతాల్లోకి కమీషన్లు, పర్సంటేజీలు చేరిపోవడమనే భారీ దందా ఇందులో దాగి ఉన్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుల పేరిట రూ.50 కోట్ల ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. పైగా ఈ ప్రాజెక్టులకు జెన్‌కో బోర్డు ఆమోదం తెలుపలేదు. ఫీజిబిలిటీ రిపోర్ట్ లేదు. డీపీఆర్ రూపొందించలేదు. కానీ జెన్‌కో ఖాతా నుంచి రూ. 26 కోట్లు డ్రా చేశారు. ఈ రెండు ప్రాజెక్టులను తమకు అనుకూలమైన ఓ కాంట్రాక్టర్‌కు గంపగుత్తగా కట్టబెట్టబోతున్నారని విద్యుత్తు సంస్థల్లో చర్చ నడుస్తున్నది. ఈ ప్రాజెక్టులు ఆచరణ సాధ్యంకావంటూ చాలా రుజువులున్నాయి. అవేంటో ఓ సారి చూద్దాం.

### 'సెలి'.. బేయర్ బలి

సెలి పవర్ ప్లాంట్‌ను చేపట్టబోయి మోసర్ బేయర్ కంపెనీ చేతులు కాల్చుకున్నది. మొదట ఈ కంపెనీయే సెలిలో 340 మెగావాట్ల జల విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఒప్పందం ప్రకారం అప్‌ఫ్రంట్ ప్రీమియంగా రూ. 64 కోట్లను కంపెనీకి చెల్లించింది. డీపీఆర్‌ను రూపొందించారు. ఇంప్లిమెంటేషన్ అగ్రిమెంట్ (ఎల్‌వోఏ) కూడా కుదిరింది. కానీ ప్రాజెక్ట్ ముందుకు కదల్లేదు. రోడ్డు మార్గం లేకపోవడం, ఆనకట్ట ఎత్తు (డ్యామ్) పెంచడంతో ముంపు వంటి సమస్యలున్నట్టు సర్కారు దృష్టికి తీసుకెళ్లింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో తాము నిర్మాణం చేపట్టలేమని చేతులెత్తేసింది. హిమపాతం కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణ సామగ్రి, పరికరాలు, యంత్రాలను తరలించడం అసాధ్యమన్న కారణాలను చూపించింది.

### సాధ్యంకాదని చెప్పినా ఆత్రమెందుకో?

సాంకేతికంగా, ఆర్థికంగా ఈ ప్రాజెక్ట్ ఆచరణ సాధ్యంకాదని మోసర్ బేయర్ కంపెనీ తేల్చింది. రూ.64 కోట్లను వడ్డీతో పాటు తమకు చెల్లించాలంటూ మోసర్ బియర్ కంపెనీ న్యాయపోరాటం చేసింది. ఈ వివాదం హిమాచల్ హైకోర్టుకు చేరింది. సెలి హైడ్రో పాజెక్ట్ సాంకేతికంగా, ఆర్థికంగా ఆచరణ సాధ్యంకాదన్న మోసర్ బేయర్ కంపెనీ వాదనను ఆ రాష్ట్ర హైకోర్టు సమర్థించింది. ఆయా మొత్తాన్ని మోసర్ బేయర్‌కు చెల్లించాలని తీర్పునిచ్చింది. అయినా కోర్టు తీర్పును హిమాచల్ సర్కారు లెక్కచేయలేదు. మళ్లీ వివాదం కోర్టుమెట్లెక్కగా ఆలస్యం కారణంగా పరిహారాన్ని రూ. 150 కోట్లకు పెంచడమే కాకుండా, పిటిషన్ దాఖలు చేసినప్పటి నుంచి 7శాతం వడ్డీతో పాటు చెల్లించాలని తీర్పునిచ్చింది. అయినా హిమాచల్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. కోర్టు తీర్పును ఖాతరు చేయలేదు. దీంతో ఢిల్లీలోని హిమాచల్‌భవన్ ఆస్తులను అటాచ్ చేయాలని, వేలం వేయాలని 2024 నవంబర్ 19న ధర్మాసనం తీర్పును వెలువరించింది.




హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ప్రతిపాదిత సెలి హైడ్రో పవర్‌ప్లాంట్ స్థలం

### రవాణాకు దారేది?

ప్రతిపాదిత సెలి ప్రాజెక్ట్ స్థలం వరకు అప్రోచ్ రోడ్డులేదు. ప్రధాన ప్రాంతాలైన సన్సారి – కిల్లర్, తిరోట్ – తండిలను అనుసంధానించేందుకు రోడ్డుమార్గం లేదు. భారీ యంత్రాలు, నిర్మాణ సామగ్రిని రవాణా చేసే పరిస్థితులు లేవు. ఈ రోడ్డు 2023లో పూర్తి కావాల్సి ఉన్నా, ఇప్పటి వరకు కాలేదు. బీఆర్‌వో అధికారుల కథనం ప్రకారం ఈ రోడ్డు డీపీఆర్ తయారీ మాత్రమే పూర్తయ్యింది. ఇంకా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించలేదు. భూసేకరణకు అనుమతులు సైతం రావాల్సి ఉంది. దాదాపు ఏడేండ్లుగా ఈ రోడ్డు నిర్మాణంలో పురోగతి లేదు. ఇలాంటప్పుడు తెలంగాణ జెన్‌కో ఎలా పనులు చేపట్టగలుగుతుంది. నిర్మాణ సామగ్రి ఎలా తరలిస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

available by 2023 and heavy machinery cannot be taken to the construction site. More over region where project is to be constructed is inaccessible for more than seven months a year on account of heavy snowfall, as such, there may be difficulty for project proponent to transport construction material/equipment/machinery. Moreover at the time of allotment of project, only 15% discharge of water during lean season was contemplated, which has now been changed to provide atleast 20% minimum release during lean period of four months and release of additional water would result in reducing the net saleable generation and therefore a shrinkage of revenue to the extent of 12%.

ఏడాదిలో ఏడు నెలలపాటు మంచు కురుస్తుందని తెలిపే ఆధారం

### ఏ కోణంలోనూ లాభదాయకం కాదు

సెలి ప్రాజెక్ట్ ప్రాంతంలో ఏడాదిలో 7 – 9 నెలలు మంచుతో కప్పి ఉంటుంది. పదే పదే వరదలు, హిమపాతాలు నిర్మాణ పనులకు ప్రధాన అడ్డంకిగా మారాయి. ప్రాజెక్ట్ కేటాయింపు సమయంలో లీన్ సీజన్‌లో 15శాతం నీటిని మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత లీన్ సీజన్‌లో నాలుగు నెలల పాటు 20శాతం నీటిని విడుదల చేయాలని మార్చారు. అదనపు నీటి విడుదల వల్ల నికర విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో 12శాతం ఆదాయం తగ్గిపోతుందని మోసర్ బేయర్ ఆందోళన వ్యక్తంచేసింది. పైగా ప్రాజెక్ట్ టారిఫ్ యూనిట్ విద్యుత్తుకు రూ.9గా నిర్ధారించారు. సోలార్ ప్లాంట్ల టారిఫ్ యూనిట్‌కు రూ. 2.50గా ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ సెలి ప్రాజెక్ట్ ఏ కోణంలోనూ ఆర్థికంగా లాభదాయకం కాదని మోసర్ బేయర్ తేల్చేసింది.

### ఎన్టీపీసీయే చేతులెత్తేసింది

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో ఎన్టీపీసీ పేరెన్నికగల సంస్థ. మోసర్ బేయర్ కంపెనీ తర్వాత ఎన్టీపీసీ వంతు వచ్చింది. 2019లో సెప్టెంబర్‌లో ఎన్‌టీపీసీ 520 మెగావాట్ల జలవిద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సెలిలో 400, మియార్‌లో 120 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాలి. బిడ్డింగ్ లేకుండా నామినేషన్ పద్ధతిలో హిమాచల్ సర్కారు ఈ ప్రాజెక్ట్‌ను ఎన్టీపీసీకి అప్పగించింది. హిమాచల్ ప్రభుత్వం వరుసగా విద్యుత్తు ఉత్పత్తిపై 11, 18, 30శాతం విద్యుత్తును రాయల్టీగా డిమాండ్ చేసింది. 40 ఏండ్ల తర్వాత ప్రాజెక్టును రాష్ట్రానికే అప్పగించాలని షరతు విధించింది. ఈ షరతులకు ఎన్టీపీసీ అంగీకరించలేదు. మూడేండ్ల తర్వాత ఎన్టీపీసీ కూడా ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగింది.

2/2005-X dated 15.5.2018, made certain amendments in its Hydro Power Policy relaxing the terms of allotment of Hydro-electric Projects.

It is also borne out from the record that project in question was allotted to NTPC without any bidding process and on much favourable terms.

There are significant difference between the terms and conditions on which the project was allotted to the petitioner in the year 2008-09, under bid document 2018 and ultimately when it was allotted to NTPC in 2019 but now NTPC has also withdrawn from the project, as the same is unviable.

సెలిప్లాంట్ ఆచరణ సాధ్యం కాదంటూ ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ వైదొలిగినట్టు రుజువు

### రెండు దశాబ్దాల్లో ఒక్కరూ ముందుకు రాలే

హిమాచల్‌లో జల విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణం ఒక అడుగు ముందుకు, పది అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. కాంగ్రెస్ సర్కారు 22 జల విద్యుత్తు ప్లాంట్లను నిర్మించతలపెట్టింది. వీటిలో చినాబ్ నదిపై లాహౌల్, స్పితి జిల్లాల్లో 595 మెగావాట్ల సామర్థ్యం గల 9 హైడల్ ప్రాజెక్టులున్నాయి. సట్లెజ్ నది బేసిన్‌లో 169 మెగావాట్ల సామర్థ్యం గల 8 హైడల్ ప్రాజెక్టులున్నాయి. రావి నదిపై నాలుగు పవర్ ప్లాంట్లు కాగా వీటి సామర్థ్యం 55 మెగావాట్లే. బియాస్ నదిపై 9 మెగావాట్ల మరో జల విద్యుత్తుకేంద్రాన్ని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే రెండు దశాబ్దాల్లో తండి, బార్‌దంగ్, మియార్, తిండి, సెలి, రియోలి గ్రామాల్లో ఏడు హైడ్రో పవర్ ప్లాంట్ల నిర్మాణానికి పూనుకోగా, ఈ 20 ఏండ్ల కాలంలో ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభంకాలేదు. స్థానికులు అడ్డుకోవడం, వ్యతిరేకించడం వల్ల ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు.

### దివాలా రాష్ట్రంతో దోస్తానా!

ప్రస్తుతం హిమాచల్ ఆర్థిక పరిస్థితి వెంటిలెటర్‌పై ఉందని నిపుణులు చెప్తున్నారు. 10 గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఆ రాష్ట్రాన్ని దివాలా దిశగా నడిపిస్తున్నది. 2లక్షల మంది ఉద్యోగులకు, 1.5లక్షల పెన్షనర్లకు కనీసం జీతాలివ్వలేని దుస్థితిలో పాలన సాగిస్తున్నది. 86వేల కోట్ల అప్పులు. రెవెన్యూ లోటు 2.6శాతం, విత్త లోటు 5.6శాతంతో కొనఊపిరిపై కొట్టుమిట్టాడుతున్నది. తమ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని ముఖ్యమంత్రే ప్రకటించారు. ఉచిత పథకాలతో దివాలా తీశామని స్పష్టంచేశారు. మంత్రుల జీతాలు, టీఏ, డీఏలు కట్‌చేశారు. ఇలాంటి రాష్ట్రంతో మనం దోస్తీ కట్టడం అంత శ్రేయస్కరం కాదన్న అభిప్రాయం నిపుణుల్లో వ్యక్తమవుతున్నది.

### హిమాచల్‌కు 3 వేల కోట్ల ఆదాయమట

సెలి, మియార్ జల విద్యుత్తు ప్రాజెక్టులతో హిమాచల్‌కు ఏటా రూ. 2,500కోట్ల నుంచి 3వేల కోట్ల ఆదాయం వస్తుందని ఆ రాష్ట్ర సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. అంటే ఆదాయం హిమాచల్‌కు.. నష్టమేమో మన కన్న మాట. విద్యుత్తు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్) 60– 70శాతం మించదు. 510 మెగావాట్లల్లో ఉత్పత్తి అయ్యేది 340 మెగావాట్లు. దీంట్లో 30శాతం హిమాచల్‌కే పోతే మనకు వచ్చేదెంత? హిమాచల్ నుంచి మనకు కరెంట్ అందే వరకు ట్రాన్స్‌మిషన్ నష్టాలు.. ట్రాన్స్‌మిషన్ చార్జీలు మొత్తంగా చూస్తే ఈ పాజెక్టులు తెలంగాణ పాలిట శాపంగా మారే ప్రమాదం లేకపోలేదని.. పెట్టిన రూ. 6,200 కోట్లు బూడిదలో పోసిన పన్నీరేనన్న వాదనలున్నాయి. ఇక క్లౌడ్‌బరస్ట్, డ్యామ్‌బ్రస్ట్‌లతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని, ప్రజలను కాపాడేందుకే జల విద్యుత్తు ప్రాజెక్టులు కడుతున్నామని హిమాచల్ సీఎం ఓ సందర్భంలో ప్రకటించారు. మరీ డ్యామ్ బరస్ట్ జరిగితే పవర్‌ప్లాంట్ కూలిపోతే తెలంగాణ సొమ్ములు నీటి పాలుకావా? ఇలాంటి వివాదాస్పద ప్రాజెక్టులు ఎవరి కోసం. ఎందుకోసమని విద్యుత్తు రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు.



సెలి ప్రాజెక్టును అనుసంధానం చేసే సన్సారి–కిల్లర్, తిరోడ్–తండి రోడ్డు పరిస్థితి

### కేసీఆర్ చేస్తే తప్పు.. కాంగ్రెస్ చేస్తే ఒప్పు

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై కాంగ్రెస్ నేతల వ్యవహారం రెండు నాల్కల ధోరణిని తలపిస్తున్నది. ఇందుకు సెలి, మియార్ ప్రాజెక్టులే తార్కాణంగా నిలుస్తున్నాయి. గతంలో కేసీఆర్ సర్కారు భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్లను నామినేషన్ పద్ధతిపై నవరత్న కంపెనీ అయిన బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించింది. దీనిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ఓపెన్ టెండర్లకు ఎందుకెళ్లలేదని ప్రశ్నించారు. ఏవో అక్రమాలు జరిగాయని గొంతు చించుకున్నారు. అధికారంలోకి రాగానే విద్యుత్తు విచారణ సంఘాన్ని వేశారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ పెద్దలు హిమాచల్‌ప్రదేశ్‌లోని రెండు ప్లాంట్లను నామినేషన్ పద్ధతిపై టీజీ జెన్‌కోకు అప్పగించారు. అప్పుడు కేసీఆర్ చేస్తే తప్పు.. కాంగ్రెస్ పాలకులు చేస్తే ఒప్పు అయ్యిందా? కేసీఆర్ సర్కారు టెండర్లకు ఎందుకెళ్లలేదో ఇప్పుడు బోధపడిందో ఏమో మళ్లీ ఇప్పుడు నామినేషన్ పద్ధతికే జైకొట్టారు. పైగా యాదాద్రి నిర్మాణ వ్యయంపైనా విమర్శలు చేశారు. వైటీపీఎస్‌ను ఒక మెగావాట్‌కు 7.6 కోట్లకు కేసీఆర్ సర్కారు అప్పగిస్తే. జల విద్యుత్తు ప్లాంట్లను ఒక మెగావాట్‌కు 11.92 కోట్లు ఖర్చుపెడుతుండటం గమనార్హం.

### ఈ ప్రశ్నలకు జవాబేది?

- అతి చౌకగా యూనిట్ రూ. 2లకే సోలార్ దొరుకుతుండగా, అతిఖరీదైన కరెంట్‌ను తెచ్చుకోవాల్సిన గతి మనకెందుకు ?
- మన రాష్ట్రంలో దుమ్ముగూడెంలో 400 మెగావాట్ల హైడల్ ప్లాంట్ కట్టుకునే అవకాశముండగా,మనం కట్టుకోకుండా హిమాచల్ షరతులకు తలొగ్గేంత కర్మ ఏం పట్టింది ?
- మియార్ ప్రాజెక్ట్ పూర్తిగా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉంది. సరిహద్దుల్లో ప్లాంట్లు కట్టడం సురక్షితమేనా.. ?
- హిమాచల్‌ప్రదేశ్‌లో 8–9 నెలలు మంచుతో కప్పి ఉంటుంది. ఈ మంచు నీరుగా మారేదెప్పుడు.. విద్యుత్తు ఉత్పత్తి అయ్యేదెప్పుడు.
- హిమాచల్ ప్రదేశ్ నుంచి మన రాష్ట్రానికి విద్యుత్తు సరఫరా చేసేందుకు పీజీసీఐఎల్‌కు ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించాలి. పైగా ట్రాన్స్‌మిషన్ నష్టాలుంటాయి. ఇవి ప్రజలకు భారం కాదా.. ?
- ఖరీదు తక్కువని మన దగ్గరున్న హైడల్, థర్మల్‌ప్లాంట్లను బ్యాక్‌డౌన్ చేసి (నడపకుండా) బయటి నుంచి సోలార్ విద్యుత్తును యూనిట్‌కు రూ. 2.72 – 2.82లకు కొంటున్నారు. మరీ ఇలాంటప్పుడు హిమాచల్‌లో ప్లాంట్ పెట్టి లాభమేంటి.. ?
- మన రాష్ట్రం విద్యుత్తు అవసరాలు 95,127 మిలియన్ యూనిట్లు కాగా, 1,23,631 మిలియన్ యూనిట్లు విద్యుత్తు అందుబాటులో ఉంది. అంటే 28,504 మిలియన్ యూనిట్లు (30శాతం) మిగులు విద్యుత్తు ఉంది. ఇక ఇలాంటప్పుడు కొత్త ప్లాంట్ పెట్టి లాభమేంటి.. ?

### వాళ్ల షరతులకు తలొగ్గే కర్మ ఏమిటి?

ఒప్పందం ప్రకారం అప్ ఫంట్ ప్రీమియం కింద జెన్‌కో రూ. 26కోట్లను చెల్లించింది. మరో రూ.26 కోట్లను ఈ నెలాఖరులోగా చెల్లించాల్సి ఉంది. అంటే మొత్తంగా రూ. 52కోట్లను హిమాచల్‌కు తెలంగాణ జెన్‌కో చెల్లించాలి. ఈ ప్లాంట్ల నిర్మాణం పూర్తయ్యాక మొదటి పన్నెండేండ్లు 12 శాతం, ఆ తర్వాత పద్దెనిమిదేండ్లు 18శాతం, పదేండ్ల పాటు 30శాతం విద్యుత్తు హిమాచల్‌కు తెలంగాణ జెన్‌కో పూర్తి ఉచితంగా ఇవ్వాలి. 40 ఏండ్ల తర్వాత రెండు ప్లాంట్లను హిమాచల్‌కే అప్పగించాలి. ప్లాంట్ నిర్మిత ప్రాంతంలో అభివృద్ధికి రూ.93 కోట్లు ఇవ్వాలి. మొత్తం ఉత్పత్తిలో 1శాతం కరెంట్‌ను స్థానికులకు ఉచితంగా ఇవ్వాలి. భూ నిర్వాసితులకు 100 యూనిట్ల చొప్పున కరెంట్‌కు సమానమైన సొమ్మును ఇవ్వాలనే షరతు ఉందట. ఎన్టీపీసీ సహా ఇతర సంస్థలేవైనా విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తే, రాయల్టీ కింద ఆ రాష్ట్రానికి 12శాతం కరెంట్‌నే ఇవ్వాల్సి ఉండగా, తెలంగాణ జెన్‌కో మాత్రం 12, 18, 30శాతం విద్యుత్తును రాయల్టీగా ఇచ్చేందుకు అంగీకరించింది. అంటే 30శాతం పోతే తెలంగాణకు వచ్చేదెంత? ఈ ప్లాంట్లపై సమగ్ర అధ్యయనం చేయకముందే ముందుకెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### డీపీఆర్ తయారీకే మూడేండ్లు

హిమాచల్ ప్లాంటుపై ఒప్పందం కుదిరినా ప్లాంట్ల నిర్మాణానికి ఓ దశాబ్దం పట్టే అవకాశమున్నది. డీపీఆర్ తయారీకే మూడేండ్లు పడుతుందని అంచనా. కావాలంటే మరో ఏడాది పొడగించుకునే అవకాశమున్నది. ప్లాంట్ల నిర్మాణానికి నాలుగేండ్లు, విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభానికి నాలుగేండ్లు పట్టనుంది. అంటే మొత్తంగా 510 మెగావాట్ల కోసం 11 ఏండ్లు తెలంగాణ వేచిచూడాలి. అది కూడా రూ.6,200 కోట్లు పెట్టుబడి పెట్టిన తర్వాత. ఇక ఉద్యోగాలు అక్కడి వాళ్లకే ఇవ్వాలి. టెక్నికల్, మినిస్ట్రీరియల్ స్టాఫ్ నంతా అక్కడివారినే రిక్రూట్ చేసుకోవాలి. అంటే ఇన్ని కోట్లు పెట్టిన తర్వాత ఒక్క ఉద్యోగం కూడా మనోళ్లకు రాదన్నమాట.

### దుమ్ముగూడెంలో కట్టాల్సిన ప్లాంట్

మన రాష్ట్రంలో దుమ్ముగూడెంలో 400 మెగావాట్ల జల విద్యుత్తు ప్లాంట్ నిర్మాణానికి గతంలోనే అనుమతులొచ్చాయి. డీపీఆర్ సైతం సిద్ధమయ్యింది. ప్లాంట్ నిర్మించుకునేందుకు వీలుగా ఇరిగేషన్‌శాఖ పైపులైన్లు వేసింది. మన రాష్ట్రంలో నిర్మించుకోవాల్సిన ప్రాజెక్ట్‌ను వదిలిపెట్టి, హిమాచల్‌ప్రదేశ్‌కు పరుగులు పెట్టడం పై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రం బయట ప్లాంట్‌ను నిర్మించడం ఇదే తొలి సారి. ఏదైనా ప్లాంట్‌ను నిర్మించే ముందు ఓ ఏజెన్సీ ద్వారా ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తయారు చేస్తారు. ఆ తర్వాత డీపీఆర్‌ను రూపొందిస్తారు. జెన్‌కో బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రామగుండంలో నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్ విషయంలో ఈ ప్రక్రియ నంతా పాటించారు. కానీ హిమాచల్ ప్లాంట్ల విషయంలో ఇవేవి జరగలేదు. ఇంత తొందర పాటు ఎందుకునే ప్రశ్నలొస్తున్నాయి. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో రివర్స్‌పంపింగ్ ద్వారా విద్యుత్తును అతి తక్కువ ఖర్చులో ఉత్పత్తి చేసుకునే వీలుంది. వీటిని పక్కనపెట్టి, హిమాచల్‌లో ప్లాంట్ కోసం ప్రాకులాడటం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

### దోచేద్దామనే..

సెలి, మియార్ ప్రాజెక్టులను నామినేషన్ పద్ధతిపై టీజీ జెన్‌కో కేటాయించినా.. రెండు ప్రాజెక్టులను ఓ కంపెనీకి అప్పగించేందుకు రంగం సిద్ధమయ్యిందట. ఓ మూడు కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే ఓ కంపెనీ రూ. 50కోట్ల ముడుపులను ప్రభుత్వ పెద్దలకు సమర్పించిందట. ఇక సదరు కంపెనీకే ఈ రెండు ప్రాజెక్టులను అప్పగించడం లాంఛనమేనట. ఇదిలా ఉండగా ఇటీవలే ప్రై వెరియేషన్ (అంచనాల పెంపు) నిబంధనలను ఎత్తివేశారు. అంటే మొదట అంచనా వ్యయం ఒకటిగా చూపించి ఆ తర్వాత ఎంతైనా పెంచుకునే ప్రమాదం లేకపోలేదు. ముందుగా ఈ రెండు ప్రాజెక్టులకు ఫీజిబిలిటీ రిపోర్ట్ తయారుచేయాల్సి ఉంటుంది. ముందు కన్సల్టెంట్‌ను నియమిస్తారు. కన్సల్టెంట్‌కు కొంత దోచిపెడతారు. ఆ తర్వాత డీపీఆర్ తయారీ ఇదో నాటకం. ఆ తర్వాత నచ్చిన కంపెనీలకు అప్పగించడం. ఈ మధ్యలో హిమాచల్‌కు రాకపోకలు. స్పెషల్ ఫ్లైట్స్, ప్రత్యేక రాచ మర్యాదలు. మొత్తంగా ప్రజల సొమ్ములను సులువుగా దోచేద్దామనే పక్కా స్కెచ్‌తోనే ఒప్పందానికి శ్రీకారం చుట్టినట్టు జెన్‌కో ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు.

### వివాదం నడిచిందిలా..

- 28 ఫిబ్రవరి 2009 సెలి ప్రాజెక్ట్‌ను మోసర్ బేయర్ కంపెనీకి అప్పగిస్తూ లెటర్‌ఆఫ్ అవార్డు (ఎల్‌వోఏ) జారీ.
- 20 జూలై 2009 మోసర్ బియర్ అప్ ఫ్రంట్ ప్రీమియం కింద రూ.64 కోట్లు చెల్లింపు.
- 22 జూలై 2021 ప్రాజెక్ట్ కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను ఏర్పాటు చేస్తూ మోసర్ బియర్, హిమాచల్ సర్కారు మధ్య ప్రీ ఇంప్లిమెంటేషన్ ఒప్పందం.
- 12 డిసెంబర్ 2011 మోసర్ బియర్ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి సమర్పణ.
- 20 జనవరి 2014 ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ అగ్రిమెంట్‌ను 30రోజుల్లో అమలుచేయాలని మోసర్ బియర్‌కు హిమాచల్ సర్కారు ఆదేశాలు.
- 2014–16 మధ్యకాలంలో మోసర్ బియర్, హిమాచల్ సర్కారు మధ్య ప్రాజెక్ట్‌కు గల అవాంతరాలు, ఆర్థిక సవాళ్లు, ప్రాజెక్ట్ ఆచరణ సాధ్యంపై దఫ దఫాలుగా చర్చలు. లేఖలు.
- 5 సెప్టెంబర్ 2016న ఇంప్లిమెంటేషన్ అగ్రిమెంట్‌ను అమలుచేయాలని మోసర్ బియర్‌కు సర్కారు నుంచి ఫైనల్ నోటీసు.
- 4 నవంబర్ 2016లో ప్రాజెక్ట్ చేపట్టడంపై ప్రభుత్వస్థాయిలో చర్చలు, విచారణ.
- 7 మార్చి 2017న సవరించిన డీపీఆర్‌ను సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీకి సమర్పణ
- 24 ఏప్రిల్ 2017న ప్రతిపాదిత ప్రాజెక్ట్‌ను అనుసంధానించే రోడ్డు 2023 నాటికి పూర్తవుతుందని బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) స్పష్టంచేస్తూ మోసర్ బియర్‌కు లేఖ
- 14 ఆగస్టు 2017 ప్రాజెక్ట్ సాంకేతికంగా, ఆర్థికంగా ఆచరణ సాధ్యంకాదని, కావున ప్రాజెక్ట్ నుంచి వైదొలుగుతున్నామని, తాము చెల్లించిన అప్ ఫ్రంట్ ప్రీమియాన్ని తమకు ఇచ్చేయాలంటూ హిమాచల్ సర్కారుకు మోసర్ బియర్ లేఖ
- 23 సెప్టెంబర్ 2017 మోసర్ బేయర్ ప్రతిపాదనకు సర్కారు తిరస్కరణ. ప్రీమియం తిరిగి ఇవ్వాలన్న వినతిని తోసిపుచ్చిన సర్కారు.
- 13 జనవరి 2023న వడ్డీతో పాటు అప్ ఫ్రంట్ ప్రీమియాన్ని చెల్లించాలని హిమాచల్ సర్కారుకు హైకోర్టు ఆదేశాలు.
- 18 నవంబర్ 2024 మోసర్ బేయర్ చెల్లించేందుకు హిమాచల్ భవన్‌ను అటాచ్ చేస్తూ, వేలం వేయాలంటూ హైకోర్టు తీర్పు.

### ఆయుధాలతో ప్రజల పోరు..

జల విద్యుత్తు ప్రాజెక్టులపై స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణవేత్తలు పోరుబాట పట్టారు. 2025 జనవరి 13న స్థానిక ప్రజలు ఏకంగా ఆయుధాలు చేపట్టి రోడ్డెక్కారు. 828 మెగావాట్ల సామర్థ్యం గల 22 జల విద్యుత్తు కేంద్రాలను ప్రకటించగానే జనం ఆందోళనలకు పిలుపునిచ్చారు. కుల్లు, చంబా, కిన్నౌర్, లాహోల్, స్పితి, సిమ్లా జిల్లాల్లో చేపట్టిన హైడ్రో ప్రాజెక్ట్‌ను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతతో జిస్పా డ్యామ్‌పై 300 మెగావాట్ల హైడ్రో పవర్‌ప్లాంట్ పనులు 15 ఏండ్లుగా ప్రారంభించలేని పరిస్థితులున్నాయి. ఈ ప్లాంట్లు హిమనీ నదాలు (ఘనీభవించిన నదులు), జీవవైవిధ్యానికి, ఎకో సెన్సిటివ్ జోన్‌కు గొడ్డలి పెట్టుగా పర్యావరణ వేత్తలు అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులను తెలంగాణ ఎలా పూర్తి చేస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.




సెలి హైడల్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మోసర్ బేయర్ కంపెనీ వెనక్కి పోవాలంటూ స్థానికుల నిరసన

# ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

## లోటస్‌పాండ్ వద్ద ఉరేసుకున్న సాధిక్ ● 'ఉచిత బస్సు'తో గిరాకీ లేక మనస్తాపం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని రేవంత్ సర్కారు ఇచ్చిన హామీ ఏడాదిన్నర గడిచినా అమలు కాకపోవడంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి పిట్టల్లా రాలుతున్నారు. రేవంత్ సర్కారు నిర్లక్ష్యానికి మరో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ హకీంపేటకు చెందిన ఆటో డ్రైవర్ సాధిక్ (28) గిరాకీ లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇక తమను ప్రభుత్వం పట్టించుకోదనే బాధతో గురువారం లోటస్‌పాండ్‌లో ఆటోను రోడ్డుపక్కన నిలిపి ఓ చెట్టుకు ఉరేసుకొని ప్రాణాలు విడిచాడు. ఇల్లు కిరాయి, ఇంటి ఖర్చులు, అప్పులతో సతమతమై చివరికి ప్రాణం తీసుకున్నాడు. ఇంటి పెద్ద దిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సాధిక్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇటీవల కొత్తగూడెనికి చెందిన దుర్గాప్రసాద్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాదిన్నరగా సర్కారు నిర్లక్ష్యంతో సుమారు 125 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

### మంత్రిగారు స్పందించరా?

ఉచిత బస్సు పథకం తమ ప్రాణాలు తీస్తున్నదని ఎంత మొత్తుకున్నా రేవంత్ సర్కారు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆటో యూనియన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తక్షణమే ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని బీఆర్‌టీయూ ఆటో యూనియన్, బీఎంఎస్ తదితర సంఘాల నాయకులు వేముల మారయ్య, రవిశంకర్ డిమాండ్ చేశారు. పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడే తమకు అన్యాయం జరుగుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయారు. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుదేనని తేల్చిచెప్పారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటోడ్రైవర్లతో చాలాసార్లు చర్చలు జరిపారని, అవన్నీ ఉత్తవేనని తెలిపారు. ఏడాదికి రూ.12 వేలు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీల అమలు అడిగితే తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు ఉంటే వారి కుటుంబ సభ్యులంతా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు.


# ఆర్టీసీలో కార్మిక సంఘాలకు చెక్?

- వాటి స్థానంలో ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటుకు సర్కార్ ప్లాన్
- సంఘాలను పునరుద్ధరిస్తామన్న ప్రభుత్వ పెద్దల హామీ ఉత్తమాటే!
- బోర్డులను రద్దు చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ప్రభుత్వం కార్మిక సంఘాలకు చెక్ పెట్టినట్టు తెలుస్తున్నది. వాటి స్థానంలో సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేసినట్టు తాజా పరిణామాలతో స్పష్టమవుతున్నది. అన్ని రీజియన్లు, జిల్లాలు, డిపోల వారీగా బోర్డులు ఏర్పాటు చేసి, వాటిలో సభ్యులను నియమించారు. ఈ సభ్యులందరికీ ఈ నెల 27న రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ "యాజమాన్యానికి, సిబ్బందికి వెల్ఫేర్ బోర్డు సభ్యులు అనుసంధానకర్తల్లాగా పనిచేయాలి. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కారిస్తాం" అని పేర్కొన్నారు. కార్మిక సంఘాలు లేకుండా చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ట్రేడ్ యూనియన్ల నేతలు మండిపడుతున్నారు. తక్షణం ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### నమ్మించి గొంతు కోస్తున్నారు

ఈ నెల 7 నుంచి సమ్మె నిర్వహించేందుకు ఆర్టీసీ కార్మిక సంఘాలు సమాయత్తమవగా.. వారిలో ఒక్కో సంఘాన్ని విడదీసి, విడతల వారీగా చర్చలు జరిపిన ప్రభుత్వం.. కార్మికుల సమస్యలు తీరుస్తామని, సంఘాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చింది. సంఘాలు ఉండటం కార్మికులకు ఎంతో శ్రేయస్కరమని నాడు చర్చల సందర్భంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చెప్పారు. ఇప్పుడు వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయడమేమిటని, ప్రభుత్వం తమను నమ్మించి గొంతు కోసిందని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు. కార్మిక సంఘాల పునరుద్ధరణే ప్రధాన ఎజెండాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తాడోపేడో తేల్చుకోనున్నట్టు తెలిసింది. ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించకపోతే.. ఆర్టీసీ యాజమాన్యం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.




### సమస్య ఏదైనా బోర్డుల ద్వారానే..

ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపకపోతే వెల్ఫేర్ బోర్డు సభ్యులు చెప్పిందే రాజ్యంగా నడుస్తదని కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య ఏదైనా వారి ద్వారానే ప్రభుత్వానికి చేరడమనేది కష్టమని కొందరు అభిప్రాయపడుతున్నారు. కార్మిక సంఘాల నేతలతో మాట్లాడినంత ప్రేమగా.. తమ పైఅధికారులతో మాట్లాడలేమని అంటున్నారు. అన్ని హక్కులను బోర్డుల ద్వారా సాధించుకోలేమని, కార్మిక సంఘాలే ఉండాలని చెప్తున్నారు. ఇన్నాళ్లూ కార్మిక సంఘాలు లేకుండానే ఆర్టీసీని నడిపిన యాజమాన్యం.. ఎన్ని సమస్యలు పరిష్కరించిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మిక సంఘాలపై కక్షపూరిత ధోరణి మానుకోవాలని చెప్తున్నారు.